

ఫీజు కట్టలేదని వేధిస్తున్నారు..

అమ్మా, నాన్న క్షమించండి - అదృశ్యమైన బీఫార్మసీ విద్యార్థిని

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అమ్మా, నాన్న నన్ను ఎంతో కష్టపడి చదివిస్తున్నారు. కళాశాలలో ఫీజు కోసం వేధింపులు ఎక్కువయ్యాయి. అందరి మధ్య నన్ను నిలబెట్టి దుతున్నారు. అవమానకరంగా చూస్తున్నారు. ఈ కాలేజీలో ఇక నేను చదవలేను. చనిపోతున్నా. దయచేసి నన్ను క్షమించండి అంటూ బీఫార్మసీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని తన గదిలో సూసైడ్ లెటర్ రాసి ఉంచి శుక్రవారం కళాశాలకు వెళ్లి, అక్కడ నుంచి ఇంటికి రాకుండా అదృశ్యమైంది. కంగారుపడిన తల్లిదండ్రులు అమ్మాయి గదిలో చూడగా తాను రాసిన ఉత్తరం బయటపడింది. వెంటనే తాలూకా పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు.. మదనపల్లె మండలం, సిటిఎం నేతాజీ కాలనీలో నివాసం ఉంటున్న సూర్యనారాయణ, సుజాత దంపతుల కుమార్తె శ్వేతశ్రీచంద్ర స్థానికంగా ఉంటున్న ఓ ప్రయివేటు బీఫార్మసీ కాలేజీలో మూడవ సంవత్సరం చదువుతోంది. ఫీజులు చెల్లించాలంటూ యాజమాన్యం అధిక ఒత్తిడి తెచ్చింది.


అదృశ్యమైన శ్వేతశ్రీచంద్ర

విద్యార్థులందరి మధ్యలో నిలబెట్టడం అవమానకరంగా మాట్లాడడం, ఫోటో తీసి వేధించడం ఇలా ఎన్నో రకాలుగా అమ్మాయిని ఇబ్బంది పెట్టారు. తల్లిదండ్రులు మాత్రం ఎలాగోలాగా ఫీజు కట్టేస్తాం, నువ్వు చదువుకోమని పురమాయించారు. ఏం చేయాలో పాలుపోని ఆ విద్యార్థిని తను ఇక ఆ కళాశాలలో చదవలేనని, ఆ అవమానాలు భరించలేనని తల్లిదండ్రులకు చెప్పుకోలేని ఉత్తరం రాసి తన గదిలో పెట్టి యథా ప్రకారం శుక్రవారం కళాశాలకు వెళ్ళింది. ఆ తర్వాత ఇంటికి తిరిగి రాలేదు. తల్లి దండ్రులు పలుచోట్ల అమ్మాయి కోసం వెతికినా దొరకలేదు. అమ్మాయి గదిలో తను రాసిన ఉత్తరం బయటపడింది. పరుగున పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మా బిడ్డ ఆచూకీ తెలిపాలని, అన్యాయం చేసే ఏ అఘాయిత్యం చేసుకుంటుందోనని చాలా కంగారుగా ఉందని తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ గాయత్రి అదృశ్యం కేసు నమోదు చేసి, అమ్మాయి ఆచూకి కనుక్కొని, విచారణ అనంతరం, కేసులో మార్పులు చేర్పులు చేస్తామని తెలిపారు.

ఆకలి కేకలు.. పస్తులతోనే పనులు..

- పారిశుధ్య కార్మికుల వెతలు
- పట్టని అధికారులు
- ఆరు నెలలుగా అందని వేతనాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణం పరిశుభ్రంగా ఉండాలన్నా.. ప్రజలందరూ వ్యాధుల బారిన పడకుండా సంతోషంగా జీవించాలన్నా, పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకం. ఉదయం 5 గంటలకే విధుల్లోకి వచ్చే కార్మికులు పరకలు చేతపట్టి పట్టణంలోని ప్రధాన రహదారులు, వీధుల రోడ్లను ఊడ్చి పరిశుభ్రం చేస్తారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలకు వెళ్లి కాలువలు శుభ్రం చేయడం, చెత్తచెదారాన్ని తొలగించడం దగ్గర నుంచి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తమ ఆరోగ్యాలను సైతం ఫణంగా పెట్టి పనులు చేస్తారు. కొన్ని సందర్భాల్లో మధ్యాహ్నం వరకు అన్నం తినే పరిస్థితి కూడా ఉండదు. వర్షాకాలం నాటి సంక్లిష్ట పరిస్థితుల్లో మంచినీరు తాగే పరిస్థితి కూడా ఉండదు. ఇంతలా పట్టణ పరిశుభ్రతకై పనిచేసే కార్మికుల కుటుంబాల్లో మాత్రం ఆకలి కేకలు వినబడుతున్నాయి. ఇంటిల్లిపాది పస్తులుండాల్సిన పరిస్థితి దాపురించింది. ఆరు నెలలుగా జీతాలు అందక, కుటుంబాలను పోషించుకోలేక, కిరాణా షాపుల్లో అప్పులు పుట్టక దయనీయ పరిస్థితుల్లో జీవనాన్ని కొనసాగిస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా వ్యవహరిస్తున్నారు.

మదనపల్లె మున్సిపల్ పరిధిలో 300 మందికిపైగా పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో 60 కార్మికులు రెగ్యులర్ కాగా, 170 మంది కార్మికులు ఆప్కాస్ పరిధిలో పనిచేస్తున్నారు. రెగ్యులర్ కార్మికులు, ఆప్కాస్ కార్మికులు ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు పొందుతున్నారు. దినసరి వేతన కార్మికులుగా పనిచేస్తున్న 80 మందికి మాత్రం సకాలంలో వేతనాలు అందని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా కరోనా ఆపత్కాల సమయంలో ఈ 80 మంది కార్మికులను దినసరి కార్మికులుగా మున్సిపాలిటీ అధికారులు నియమించారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో పారిశుధ్య కార్మికులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి విధులు నిర్వహించారనడంలో అతిశయోక్తి లేదు. ఏదైనా ప్రాంతంలో కరోనా పాజిటీవ్ కేసు ఉందంటే అ ప్రాంతంలోని వాసులు ఇళ్లకే పరిమితమయ్యేవారు. హోమ్ క్వారంటైన్‌లో, ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్వారంటైన్‌లో తల దాచుకునేవారు. అలాంటి క్లిష్ట


కోమిటివాని చెరువులో గ్యాంగ్ వర్క్ చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రాంతాల్లోకి సైతం పారిశుధ్య కార్మికులు వెళ్లి విధులు నిర్వహించారు. కాగా దినసరి వేతన కార్మికులకు నెలసరి రూ.14 వేలు వేతనం మాత్రమే చెల్లిస్తున్నారు. ఆరోగ్యం బాగలేకపోవడమో, కుటుంబ సమస్యల వల్లో, మరే ఇతర కారణాల వల్లో ఒక్కరోజు సెలవు పెట్టారంటే ఆరోజు నిర్దాక్షిణ్యంగా రూ.500 వరకు కట్ చేస్తున్నారు. ఇచ్చే అరకొర జీతంలో సైతం ఇలా కోత విధిస్తుండడంతో కార్మికులది నోరు మెదపలేని పరిస్థితి. ఎవరైనా ధైర్యం చేసి ప్రశ్నిస్తే వారిని విధుల నుంచి తప్పించేందుకుఏమాత్రం వెనుకాడకుండా నిర్ణయాలు తీసుకొంటుండడంతో కార్మికులు బిక్కుబిక్కు మంటూ కాలం వెల్లదీస్తున్నారు. కొంతమంది కార్మికులు ప్రతిరోజు 5 నుంచి 10 కిలోమీటర్ల వరకూ ప్రయాణం చేసి విధులకు హాజరవుతున్నారు. వీరికి రానుపోను ఆటో, బస్సు ఛార్జీలు నెలకు రూ.2 వేలు నుంచి రూ.3 వేల వరకు ఖర్చు వస్తోంది. ఇచ్చే అరకొర జీతాలు సైతం సకాలంలో ఇవ్వకపోవడంతో బయట అప్పులు పుట్టక కాలినడకనే విధులకు హాజరవుతున్న దుర్భర పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ప్రతినెల రూ.14 వేలు వేతనం ఇచ్చే కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు అందకపోవడంతో దిక్కు తోచని సందిగ్ధంలో పడిపోయారు. బయట అప్పులు పుట్టక, కిరాణా షాపుల్లో సరుకులు దొరక్క, విధులకు వెళ్లేందుకు ప్రయాణ ఖర్చులు లేక కాలి నడకనే వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కావడంతో పిల్లలకు ఫీజులు, పుస్తకాలు, బట్టలు బోలెడంత ఖర్చులు ఉన్నాయి. పలుమార్లు యూనియన్ నాయకులు తమ సమస్యలను పరిష్కరించాలని, జీతాలు చెల్లించాలని మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నాలు, నిరసనలు తెలియజేసినా అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం విచార కరం. కార్మికులకు ప్రభుత్వం అందించే సోపులు, నూనె, బ్లౌజులు, పనిముట్లు రెండేళ్లుగా అందలేదు. అది కుడా ఈ సౌలభ్యం కేవలం రెగ్యులర్, అప్కాస్ కార్మికులకు మాత్రమే ఉంది. దినసరి వేతన కార్మికులకు ఈ సౌలభ్యం కూడా ఉండదు. కేవలం రోజువారి వేతనం మాత్రమే అందుతుంది. అది కూడా ఆరు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో చాలా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి దినసరి వేతన కార్మికులకు బకాయి ఉన్న ఆరు నెలల వేతనాన్ని చెల్లించాలని, దాంతోపాటు వారికి ఉద్యోగ భద్రత కల్పించి, రెగ్యులర్ కార్మికుల వలే ఇఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించడంతో పాటు సోపులు నూనె, పనిముట్లు ఇవ్వాలని కోరుతున్నారు.

బిడ్డల చదువు భారంగా మారింది

ఆరు నెలలుగా జీతాలు లేకపోవడంతో బిడ్డల చదువులు భారంగా మారాయి. ఫీజులు కట్టాలి, పుస్తకాలు కొనాలి, కొత్త బట్టలు తీయాలి. ఇచ్చే అరకొర వేతనాలు కూడా లేకపోతే ఎలా బతికేది



- రమణమ్మ, పారిశుధ్య కార్మికురాలు, అమ్మచెరువుమిట్ట.

పస్తులతో పనులు చేస్తున్నా

పస్తులతో పనులు చేస్తున్నానంటే నమ్మండి. ప్రతి రోజు 10 కిలోమీటర్లు ప్రయాణం చేస్తున్నా. ఉదయం 4 గంటలకు ఇంట్లో నుండి బయల్దేరితే రాత్రి ఇళ్లు చేరే సమయానికి 7 గంటలవుతోంది. ప్రయాణం, భోజన ఖర్చులు రోజు కనీసం రూ.100 కావాలి. ఆరు నెలలుగా వేతనాలు లేకపోవడంతో పస్తులతో పని చేస్తున్నా. కార్మికుల జీవితాలంటే అంత చులకనా.



- ఉత్తన్న, పారిశుధ్య కార్మికుడు, గుండాలపల్లి.

తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు

- ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి ఘటనపై సోషల్ మీడియా ఇతర ప్రసార మాధ్యమాలలో తప్పుడు ప్రచారం వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు హెచ్చరించారు. శనివారం పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జాతీయ భద్రతకు భంగం కలిగించేలా సోషల్ మీడియా ఇతర ప్రసార మాధ్యమాలలో తప్పుడు సమాచారం వ్యాప్తి చేసిన, అవాస్తవాలను సృష్టించిన, పుకార్లను ప్రసారం చేసిన వాటిని షేర్ చేసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సామాజిక మాధ్యమాల గ్రూప్ అడ్మిన్లు ప్రతి సమాచారాన్ని తనిఖీ చేసుకోవాలని ఆయా గ్రూపులో తప్పుడు సమాచారం వస్తే గ్రూప్ అడ్మిన్‌లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాయచోటి ఘటన గురించి ఈనెల 3న పోలీసులు పత్రికా ప్రకటన జారీ చేశారని దీని ఆధారంగా కేంద్ర దర్యాప్తు బృందం విచారణ చేస్తుందన్నారు. ఎలాంటి విషయాలు ఉన్నా అధికారికంగా జిల్లా పోలీస్ తెలుపుతారని అన్నారు. జాతీయ భద్రతకు సంబంధించిన విషయమని కావున ప్రజలు భయభ్రాంతులకు కలిగించే ప్రమాదం ఉందని తెలిపారు. ఊహాగానాలు, కథనాలు సృష్టించిన పుకార్లు వ్యాప్తి చేసిన ప్రసారం చేసిన షేర్ చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమాజంలో మీడియా పాత్ర విలువైందని కావున పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. ఏదైనా విషయానికి సంబంధించి పోలీసు అధికారులను సంప్రదించి నిర్ధారించుకోవాలని తెలిపారు.


మాట్లాడుతున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు


నిరసన తెలుపుతున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం

- ఇయు జిల్లా కార్యదర్శి శేఖర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ పోరాటం ఆగదని ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.సి.శేఖర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం రెండవ రోజు గేట్ సమావేశంలో ఆర్‌టిసి కార్మికులతో కలిసి డిపో వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసిలో ఉద్యోగోన్నతులు వెంటనే చేపట్టాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వ సహకారంతో ఆర్‌టిసి సొంతంగా కొనుగోలు చేసి నడపాలని, ఎలక్ట్రిక్ బస్సులను ఆర్‌టిసి సిబ్బందితోనే నడపాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు 12వ పిఆర్‌సి కమిషన్ నియమించి ఐఆర్ ప్రకటించాలని, ప్రభుత్వం ద్వారా రావలసిన పెండింగ్ డిఎలు, బకాయిలు, 11వ పిఆర్‌సి అరియర్స్ వెంటనే చెల్లించాలని, డబుల్ డ్యూటీ చేస్తున్న ఉద్యోగులకు డిడి అమౌంట్ పెంచాలని, ఇహెచ్‌ఎస్ ద్వారా సరైన వైద్య సౌకర్యాలు అందనందున ఆర్‌టిసి ఉద్యోగులకు పాత పద్ధతుల్లోనే వైద్య సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో అమలులో ఉన్న 1/2019 సర్క్యులర్ అమలుపరచుటకు స్పష్టమైన ఆదేశాదివ్వాలని, సిసిఎస్ కార్యాలయం ఉద్యోగులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని, ఎఎఎస్ ఇంక్రిమెంట్లు అమలులో జరుగుతున్న లోపాలను సవరించి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు చల్లా వెంకటేష్, డిపో అధ్యక్షులు సుబ్బయ్య, డిపో కార్యదర్శి కీము, ముఖ్య సలహాదారు ఎం.చలపతి, గ్యారేజీ కార్యదర్శి ఎన్.వెంకటసుబ్బయ్య, చిన్నోడు, సాలమ్మ, మంజుల, నాగ మునెమ్మ, సుధా, కుమారి పాల్గొన్నారు.

మండల మాజీ అధ్యక్షులు మడితాటి రాజారెడ్డి మృతి

ప్రజాశక్తి - రాయచోటి

టిడిపి సీనియర్ నాయకులు, మండల మాజీ అధ్యక్షులు మడితాటి రాజారెడ్డి శనివారం ఉదయం పట్టణం ఎస్ఎన్ కాలనీలోని తన నివాసంలో గుండెపోటు మృతి చెందారు. మడితాటి రాజారెడ్డి ఆకస్మిక మరణవార్త విషయం తెలిసి రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి, టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు, టిడిపి నియోజకవర్గ నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, పలువురు టిడిపి నాయకులు రాజారెడ్డి భౌతిక కాయానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజారెడ్డి సీనియర్ నాయకుడిగా రాయచోటి మండలం అభివృద్ధిలో భాగస్వామి అయిన ఆయన మరణం తీరని లోటని పలువురు సంతాపం తెలిపారు. రాజారెడ్డి అంత్యక్రియలు ఆదివారం మాసాపేట రెడ్డివారిపల్లెలో నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

మన చేతుల్లోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అతిసార, డెంగీ నియంత్రణ మన చేతుల్లోనే ఉందని డాక్టర్ జులేఖ బేగం అన్నారు. శనివారం మండలంలోని ఎర్రగుంట్లబావి గ్రామంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా అతిసార, డెంగీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ చేతుల శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోజు సాయంత్ర వేళల్లో వేపాకు పొగ వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ సౌజన్య, ఎఎన్ఎం నిర్మల, సూపర్‌వైజర్ వలి, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ

10న మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ఈ నెల 10న జిల్లా వ్యాప్తంగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌ను నిర్వహిస్తున్నామని, తల్లిపేరుతో ప్రతి విద్యార్థితో మొక్క నాటించడం ద్వారా తల్లిదండ్రుల పట్ల, పర్యావరణం పట్ల బాధ్యత పెంపొందితాయని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో మెగా పేరెంట్స్ టీచర్ మీట్ నిర్వహిస్తోందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పిల్లల తల్లిదండ్రులను పాఠశాలలతో సమన్వయం చేసి విద్యార్థులను అన్ని రకాలుగా తీర్చిదిద్దడమని పేర్కొన్నారు. విద్యార్థుల యొక్క బాధ్యత కేవలం పాఠశాలలదే కాదని వారి తల్లిదండ్రులు కూడా వారి పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల యొక్క ప్రోగ్రెస్ రిపోర్టులను తల్లిదండ్రులతో చర్చించడం జరుగుతుందన్నారు. మీట్ జరగబోయే రోజున గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపులో భాగంగా విద్యార్థులంద రూ తమ తల్లిదండ్రులకు నమస్కరించి అమ్మ పేరు మీద చెట్టు నాటే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. పిల్లల్లో చిన్ననాటి నుండే పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు చేస్తున్నామని తెలిపారు. పాఠశాలల వారీగా ప్రజాప్రతినిధులు, పూర్వపు విద్యార్థులు, పాఠశాల కమిటీలు, దాతలు, తల్లిదండ్రులు భాగస్వాములై పిల్లల భవిష్యత్తుకు నూతన బాటలు వెయ్యాలని కోరారు. విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయంగా నిర్వహించే మెగా పేరెంట్ టీచర్స్ మీట్స్ నిర్వహణ విజయవంతంగా జరిగేలా చూడాలని అందుకు మీడియా కూడా ప్రధాన పాత్ర పోషించాలని కోరారు. సమావేశంలో మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘా స్వరూప్, పాఠశాల విద్యాశాఖ ప్రతినిధి జనార్ధన్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవి, పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

స్వర్ణాంధ్ర సాధించడమే పి4 లక్ష్యం

2029 కల్లా పేదరికం లేని స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించడమే లక్ష్యంగా పి4 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్లోని విసి హాల్లో పేదరికం లేని సమాజం-పి4 కార్యక్రమంపై కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆలోచన నుండి పుట్టిన పి 4 కార్యక్రమంలో సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మంది అట్టడుగునున్న 20 శాతం మందిని దత్తత తీసుకొని వారి అభ్యున్నతికి పాటుపడనున్నారు. కార్యక్రమంపై అధికారులకు, సిబ్బందికి తగిన ఆదేశాలు, సూచనలను జారీ చేశామన్నారు. 2029 కల్లా పేదరికం లేని స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించడమే లక్ష్యంగా ఈకార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మార్గదర్శకులను బంగారు కుటుంబాలతో లింక్ చేసి బంగారు కుటుంబాలకు మార్గదర్శి చేయూత ఇచ్చి వారి అభ్యున్నతికి పాటుపడనున్నారు. మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ పాల్గొన్నారు.

వైభవంగా సౌమ్యనాథుడి ధ్వజారోహణం


ధ్వజారోహణం నిర్వహిస్తున్న పాంచరాత్ర ఆగమ పండితులు

ప్రజాశక్తి - నందలూరు

జిల్లాలో ప్రముఖ వైష్ణవ క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శనివారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సునీల్ కుమార్, పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్ కుమార్, మనోజ్ కుమార్, సాయి స్వామి ఆధ్వర్యంలో గజ స్థంభంపై గరుడ చిహ్నంతో ఉండే పతాకాన్ని ఎగరవేసి ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ధ్వజారోహణం బ్రహోత్సవాలకు సూచిక. సకల దేవతలకు ఆహ్వానం పలికే ధ్వజారోహణంలో మహావిష్ణువుకు గరుత్మంతుడు ప్రియ వాహనం. ఆ గరుడ నిలువెత్తు రూపం 20 మీటర్ల నూతన వస్త్రంపై పసుపు, కుంకుమ, తైలంతో చిత్రీకరించారు. దీనినే ధ్వజపటం అంటారు. ఈ నూతన వస్త్రం ధ్వజస్తంభంపై ఎగరవేసే సకల దేవతలు బ్రహ్మోత్సవాలను తిలకిస్తారని ప్రతీతి.వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలు మధ్య గరుడ ధ్వజపీఠాన్న ధ్వజస్తంబాగ్రహమునకు లాగారు దీంతో ధ్వజారోహణం పూర్తయింది. రాత్రి యాలి వాహనంపై మహా తేజోవంతుడు శ్రీసౌమ్యనాథుడు శ్రీదేవి భూదేవితో కలిసి విశేషాలంకరణలో పురవీధుల్లో ఊరేగుతూ భక్తజన కోటికి దర్శనమిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దిలీప్, విజిలెన్స్ అధికారి శేషాచలం, ఎస్ఐ మల్లికార్జున రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలో నేడు: ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు ఆదివారం ఉదయం పల్లకిసే, గ్రామోత్సవం, తిరుమంజనం. రాత్రికి హంస వాహనంపై శ్రీసౌమ్యనాథ స్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నామని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దిలీప్ పేర్కొన్నారు.

పిల్లలతో భిక్షాటన చేయించడం నేరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పిల్లలను పనికి, భిక్షాటనకు పంపడం చట్టరీత్యా నేరమని, సంచార ప్రజలకు సిడిపిఇఒ నాగవేణి అవగాహన కల్పించారు. మదనపల్లె చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో చైల్డ్ బెగ్గింగ్, చైల్డ్ లేబర్ పైన చైల్డ్‌లైన్ డిపార్ట్మెంట్లతో కలిసి శనివారం స్థానిక అమ్మ చెరువమిట్ట వద్ద గుడారాలలో నివాసముంటున్న సంచార ప్రజలతో మాట్లాడారు. వారు స్పందిస్తూ తాము వినుకొండ మండలం గుంటూరుకు చెందిన వారుగా చెప్పారు. చిన్న పిల్లలని చదివించాలని,బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని, 0 నుండి 6 సంవత్సరాల పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని సిడిపిఒ వారికి సూచించారు. పిల్లలను పనికి, బిక్షాటనకు పంపడం చట్టరీత్యా నేరమని కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలను గుర్తించడానికి అంగన్వాడీ, సచివాలయం సిబ్బందితో సర్వే చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో సంబంధిత శాఖలతో కలసి సమన్వయం చేసుకొని పనిచేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎఎల్ఎస్ సిఒ వెంకట రామయ్య, మదనపల్లె అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఇర్ఫాన్, ఎంఇఒ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట రవి కుమార్, సోషల్ వర్కర్ లావణ్య, అవుట్ రీచ్ వర్కర్ సురేష్, సిఆర్‌పిలు సదాశివరెడ్డి, లక్ష్మిదేవి, ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్వేత పాల్గొన్నారు.


సంచార ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ సుజాత

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పుల్లంపేట : ఓబుల వారిపల్లి మండల పరిధిలోని ఎపిఎండిసి వద్ద భోజన విరామ సమయంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎ.రామానుజులు ఆధ్వర్యంలో శనివారం కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9వ తేదీన 11 కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే సమ్మె గత సమ్మెళ కంటే భిన్నమైనదన్నారు. కార్మికుల ప్రాథమిక హక్కులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కబలించబోతున్నాయని తెలిపారు. మోడీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా లేబర్ కోడ్స్ తెచ్చిందని, వాటిని వెంటనే రద్దు చేసి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవకుమార్‌రెడ్డి, మావిళ్ళశేఖర్, అరుణావతి, ధనలక్ష్మి, శివ, సందీప్, అరవింద్, గంగా ప్రసాద్, లావణ్య పాల్గొన్నారు.

వాల్మీకిపురం : ఈ నెల 9న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రామయ్య అన్నారు. స్థానిక పాత తహశీల్దార్ కార్యాలయం వద్ద కరపత్రాలను ఆవిష్కరించి, నిరసనలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సురేంద్రబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మనో హర్‌రెడ్డి, ఆశ కార్యకర్తలు స్వరూప, అనిత, మల్లిక, కార్మికులు శ్రీరాములు, వెంకటేష్, శ్రీనివాసులు, చంద్రమ్మ, భారతమ్మ, చంద్ర పాల్గొన్నారు.


వాల్మీకిపురం : కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ఉలికిపాటు!

ప్రజా'దృష్టి'

రాయచోటిలో ఉగ్రవాదుల కదలికలు వెలుగులోకి రావడం ఉలికిపాటుకు గురిచేసింది. మూడు దశాబ్దాలుగా ఉగ్రవాదులు కదలికలు బయటపడకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పోలీసు, ఇతర నిఘా వ్యవస్థలు గుర్తించలేకపోవడం చకితులను చేస్తోంది. ఎటిఎస్, ఐబి స్థాయి ఉన్నతాధికారులు పకడ్బందీగా నిఘావ వేసి గుర్తించే వరకూ ఉగ్రవాదుల కదలికలను పోలీసు యంత్రాంగం గుర్తించలేకపోవడం ఏమిటనే చర్చ నడుస్తోంది. ప్రతిఏటా హిందూ, ముస్లిముల ఉత్సవాలు, ఊరేగింపులు, ఇతర సాంస్కృతిక పండుగల సమయంలో రాయచోటి కేంద్రంగా మతతత్వ సంస్థలు ఏదోఒక ఉద్రిక్త సంఘటల్ని సృష్టించడం, పోలీసులు జోక్యం చేసుకుని సర్దుబాటు చేయడం పరిపాటి. ఎటిఎస్, ఐబి వంటి నిఘా సంస్థలు నెలల తరబడి రాయచోటిలో నిఘా వేసి ఉగ్రనాగులను అదుపులోకి తీసుకోవడం ఊపిరిపోసింది. లేని పక్షంలో ఉగ్రవాదులు ఎటువంటి దశ్చర్యలకైనా తెగబడి ఉంటే పరిస్థితి ఏమిటనే వాదన వినిపిస్తోంది. పట్టుబడిన ఉగ్రనాగులు తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాల్లో మూడు దశాబ్దాల కిందటి నుంచి పేలుళ్లకు పాల్పడుతూ రావడం క్షంతవ్యం కాని నేరం. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వ నిఘా, పోలీస్ వ్యవస్థల పనితీరు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. రెండ్రోజుల కిందట రాయచోటి నియోజకవర్గ పరిధి లోని సంబేపల్లి మండల పరిధిలోని ఓ పాఠశాలకు చెందిన విద్యార్థులను కొంతమంది తాగుబోతులు కర్రలు తీసుకుని పాఠశాలలోకి వెళ్లి చేతులు విరిగేలా కొట్టారు. తాగుబోతులు పాఠశాలలోకి కర్రలు తీసుకెళ్లడమేమిటి, కర్రలతో వెళ్తుంటే పాఠశాలకు చెందిన సిబ్బంది ఏమి చేస్తున్నారు. ఇంతటి దారుణమైన ఘటనకు బాధ్యులు ఎవరు, ఎక్కడి వెళ్లారు, ఏమి చేస్తున్నారో తెలియాల్సి ఉంది. ఇళ్ల దగ్గర పిల్లలకు రక్షణ ఉండదనే ఉద్దేశంతో తల్లిదండ్రులు పాఠశాలలకు పంపించడం తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో పాఠశాలలోనే భద్రత లేదు. ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం ఏమిటి, ప్రభుత్వ పాఠశాలల్లో రక్షణ లేకపోతే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వ పాఠశాలల్లో భద్రతకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఫ్రీహోల్డ్ భూముల మ్యుటేషన్ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో చింతకొమ్మదిన్నె తహశీల్దార్ పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడిన సంగతి తెలిసిందే. తాజాగా వీరబల్లి మండలంలో ఫ్రీహోల్డ్ భూముల వ్యవహారం వెలుగు చూశాయి. ఫ్రీహోల్డ్ భూముల వ్యవహారంపై సీరియస్‌గా దృష్టి సారించి, పదేపదే అవకతవకలకు పాల్పడుతున్న తహశీల్దార్ స్థాయి అధికారులను సర్వీస్ నుంచి తొలగించడం, డీమోట్ చేయడం వంటి శిక్షలు విధిస్తే ఇటువంటి భూముల అవకతవకలకు అవకాశం లేకుండా పోతుందనే వాదన వినిపిస్తోంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి


ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న రెడ్డప్ప

సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టింగ్‌లపై ఫిర్యాదు

ప్రజాశక్తి-సుండుపల్లి

టిడిపికి నాయకులు, కార్యకర్తల మనోభావాలు దెబ్బతినే విధంగా సోషల్‌మీడియాలో పోస్టింగ్‌లు పెడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని మండల టిడిపి అధ్యక్షులు కళ్లే రెడ్డప్ప శనివారం ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందలవాండ్లపల్లికి చెందిన కంచన రెడ్డిశేఖర్, సుండుపల్లికిచెందిన షేక్ యూసుఫ్ వాట్సప్ గ్రూపుల్లో టిడిపి పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు, సీనియర్ టిడిపి నాయకులపై తప్పుడు కథనాలతో అసభ్యకర పోస్టింగులు పెట్టి తమ మనోభావాలను కించపరిచేలా వ్యవహరించడం చాలా హేమమయ్య చర్యని అన్నారు. ఇలాంటి వారిపై వెంటనే స్పందించి శాఖపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని కోరారు.

అందుబాటులో చిన్నపిల్లల వైద్యులు

ప్రజాశక్తి-సుండుపల్లి


డాక్టర్ దిలీప్‌గుప్తా

మండల కేంద్రం సుండుపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నపిల్లలకు వైద్యం అందుబాటు లోకి వచ్చింది. డాక్టర్ దిలీప్‌గుప్తా చిన్నపిల్లల వైద్యులుగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చిన్న పిల్లలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. పిల్లలను ఆరోగ్యంగా ఉంచడమే నా సంకల్పమని అన్నారు. చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తానని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్న పిల్లల వైద్యుడు అందుబాటులో ఉండటంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వ్యయ ప్రయా సాలతో ఇక సుదూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేదని అన్నారు.

ఓపెన్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ ద్వారా నిమ్మనపల్లి జడ్‌పి హైస్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.అంజాద్‌అలీఖాన్ తెలిపారు. అనివార్య కారణాల వలన విద్యకు దూరమైన విద్యార్థులు తిరిగి విద్యను అభ్యసించడానికి ప్రభుత్వం ఓపెన్ స్కూల్ ద్వారా మరలా అవకాశం కల్పించిందని అన్నారు. 2025-26 విద్యా సంవత్సరం గాను ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ ద్వారా నిమ్మనపల్లి జడ్‌పి హైస్కూల్లో పదవ తరగతిలో 100మంది విద్యార్థులకు, ఇంటర్మీడియట్‌లో 50మంది విద్యార్థులకు ప్రవేశం పొందే అవకాశం కల్పించిందని అన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 25వ తేదీ లోపు ఫీజు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. మరింత సమాచారానికి డాక్టర్ రాజేంద్రకుమార్ 70131 77960 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. చదువును మధ్యలో ఆపేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట


రక్తదానం చేస్తున్న అశోక్

ఆస్పత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్న ఓ వృద్ధురాలికి యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు అశోక్ రక్తదానం చేసి అండగా నిలిచారు. బెంగళూరులో ఎం.ఎస్.రామయ్య ఆస్పత్రిలో అనారోగ్యంతో ఓ వృద్ధురాలు వైద్యం చేయించుకుంటోంది. చికిత్స నిమిత్తం ఆ వృద్ధురాలికి రక్తం అవసరం కాగా కుటుంబ సభ్యులు యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వారిని సంప్రదించగా సభ్యు డైన అశోక్ రక్తం అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ మాట్లా డుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే తమ ఫౌండేషన్ ప్రధాన ఉద్దేశ్యమని వెల్లడించారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

- బాస్ వ్యవస్థాపక అధ్యక్షులు శివప్రసాద్

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

బుద్ధుని తల నరికి తల, మొండెం వేరు చేసిన మతోన్మాదుల్ని పట్టుకోమని నిరసన తెలిపితే మమ్మల్ని తీసుకొచ్చి స్టేషన్‌లో నిర్బంధించాలని ఎస్‌పి ఆదేశాలివ్వడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్ పేర్కొ న్నారు. బుద్ధుని విగ్రహం తల నరికిన ఉదంతంపై నిరసన దీక్ష చేపట్టిన తమను అరెస్టు చేసి, దీక్ష భగ్నం చేసేందుకు పోలీసులు విశ్వ ప్రయత్నం చేసి, దురుసుగా ప్రవర్తిం చారని అన్నారు. ఆ తర్వాత పోలీసులు ఎస్‌పి ఆదేశాలతో రెచ్చి పోయారని, తనను ఎస్ఐ గదిలో రెండు గంటల పాటు నిర్బంధించారని అన్నారు. తాను గుండె జబ్బుతో ఉన్నానని, ఉదయం నుంచి భోంచేయలేదని, వెళ్లి టాబ్లెట్స్ వేసుకొని తిరిగి వస్తానని ఎంతగా చెప్పినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. శివప్రసాద్‌ను పరామర్శించడానికి బాస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉలగనాధన్ గణపతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలకుంట శ్రీనివాసులు, రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల మోహన్ లతోపాటు పెద్ద సంఖ్యలో బాస్ నాయకులు అస్పత్రికి తరలివచ్చారు.

యువసేన క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని కదిరి రోడ్డు, టిప్పు సుల్తాన్ మైదానంలో శనివారం జహా యువసేన క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరు కాగా టోర్నీ నిర్వాహకులు, టిడిపి నాయకులు మండిపల్లి మధుసూదన్‌రెడ్డి, రాటకొండ శ్రీనివాసులు నాయుడు, రెడ్డి రాయల్, చల్లా చలపతి, మోహన్ రెడ్డి, బొమ్మిశెట్టి పురుషోత్తం, బీదం గురునాథ్ యాదవ్, జీవి నాయుడు తదితరులు శాలువా పూలమాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలలో యువతను ప్రోత్సహించడానికి టిడిపి నాయకులు ఇటువంటి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రస్తుతం యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలు, సామాజిక సేవా కార్యక్ర మాల్లో ముందుండాలని సూచించారు. క్రీడాస్ఫూర్తితో యువత క్రీడల్లో రాణించడం ఎంతో ముఖ్యమన్నారు. క్రీడారంగం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వెల్లడించారు. యువత చదువుతో పాటు క్రీడలపై మక్కువ పెంచుకోవానలి ఆయన సూచించారు. అద్భుతమైన బ్యాటింగ్‌తో ఎమ్మెల్యే టోర్నమెంట్ ను ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గంగారపు రామ్మూర్తి నాయుడు, తమ్మిశెట్టి రామకృష్ణ, జంగాల వెంకటరమణ, నాదెళ్ల శివన్న, బెల్లె రెడ్డి ప్రసాద్, డి.రమేష్ రెడ్డి, బాలమాలి శేఖర్, శివాజీ రాయల్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బ్యాటింగ్ చేస్తూ క్రికెట్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మామిడి రైతులను ఆదుకోండి : 'కొరముట్ల'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు


మామిడి కాయలను పరిశీలిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

కూటమి ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని మైసూరువారిపల్లి పంచాయతీ పరిధిలోగల ప్రయివేట్ మామిడికాయల యార్డ్‌ను సందర్శించి అక్కడ ఉన్న రైతులు, వ్యాపారస్థులతో కలిసి వారి సాధక బాధకాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యాపార రంగమే పూర్తిగా దివాలా తీసే పరిస్థితికి వచ్చిందని అన్నారు. కోడూరు అంటే బొప్పాయి, అరటి, మామిడికి పేరు గాంచిందని నేడు మామిడికాయ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కుదరక కనీసం కోత కూలీలకు కూడా రాలేదని చాలామంది రైతులు కొన్ని తోటలను అలాగే వదిలేస్తున్నారని అన్నారు. కొంతమంది రైతులు అయితే అప్పులు తెచ్చి పంట పైన పెడితే కనీసం వాటికి కొట్టిన మందులకి కూడా డబ్బులు వచ్చే పరిస్థితి లేదని అన్నారు. చేసిన అప్పులకు వడ్డీ లేక ఆత్మహత్యలే శరణ్యమని రైతులు అంటున్నారని ఆవేదన వ్యకతం చేశారు. నామమాత్రంగా జిల్లా అధికారాలు రైతులు దగ్గరకి వచ్చి రూ.4కు ప్రభుత్వం తరపున ఇప్పిస్తామని చెప్పి వెళ్లిపోయారని ఇప్పటి వరకు ఒకరికి కూడా ఇవ్వలేదని అన్నారు. అధికారులు వచ్చిన వెళ్లిన తర్వాత ఒక రూపాయి తగ్గించి ఫ్యాక్టరీ యజమానులు తీసుకుంటున్నారని అన్నారు. 2005లో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఇటువంటి క్లిష్టపరిస్థితి వచ్చినపుడు ఫ్యాక్టరీ యజమానులు అందరిని పిలిపిచ్చి ప్రతి రైతు దగ్గర పది రూపాయలకు తగ్గకుండా తీస్కుకోవాలని లేని యెడల ఫ్యాక్టరీలను ప్రభుత్వం స్వాదినంలోకి తీసుకుని నడిపిస్తామని ముక్కుసూటిగా వారితో చెప్పడంతో ఆ మరుసటి రోజు రూ.18లకు కొన్నారని అన్నారు. వై.ఎస్.జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మూడు వేల కోట్ల రూపాయలతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి ఇటువంటి క్లిష్టపరిస్థితిలో ఉన్న వారికి అందించారని అన్నారు. కూటమి ప్రభుత్వం వల్లే కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడిందని ప్రగల్బాలు చెప్పుకుంటున్నారే కానీ మీరు ఎందుకు ఆదుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. త్వరగా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకోవాలని లేని యెడల ఇదే మామిడికాయల యార్డ్ వద్ద జాతీయ రహదారి పైన ధర్నాకు కూర్చుంటామని అన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, భరత్ కుమార్ రెడ్డి, సర్పంచ్ నరేంద్రవర్మ, హరికృష్ణరెడ్డి, సుబ్రహ్మణ్యం రాజు, సుదర్శన్‌రాజుపాల్గొన్నారు.

పేదరికం లేని సమాజమే ప్రభుత్వ లక్ష్యం

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బిసి.జనార్దన్‌రెడ్డి


విసికి హాజరైన కలెక్టర్,జెసి, అధికారులు

ప్రజాశక్తి-రాయచోటి

పేదరికం లేని సమాజమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బంగారు కుటుంబాల అవసరాలను బట్టి మార్గదర్శులతో లింక్ చేయాలని సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని పిజి ఆర్ఎస్ హాల్లో పేదరికం లేని సమాజం పి4 కార్యక్రమంపై జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో కలెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి మంత్రి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు విజన్ - 2047 లో భాగంగా పి-4 కార్యక్రమంలో బంగారు కుటుంబాలను మార్గదర్శకులతో లింక్ చేయడం ద్వారా పేదరికం లేని సమాజం నిర్మించ బడుతుందని అన్నారు. ఈ కార్యక్రమం ప్రపంచంలోనే వినూత్నమైనదని దీర్ఘకాలంలో దీని ఫలితాలు ఎన్నో చూడబో తున్నామని అన్నారు. కార్యక్రమంలో సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న ఎన్ఆర్ఐలు, కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలు తదితరులను మార్గదర్శకులుగా తీసుకుని అట్టడుగున ఉన్న 20 శాతం మంది బంగారు కుటుంబాలతో లింక్ చేయబోతున్నామని పేర్కొన్నారు. బంగారు కుటుంబాలకు అవసరానికి తగినట్లుగా మార్గదర్శులను ఎంపిక చేసుకొని లింక్ చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా ఇన్చార్జి మంత్రిగా తన సహకారం ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన నుంచి పుట్టిన పి4 సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మంది అట్టడుగునున్న 20 శాతం మందిని దత్తత తీసుకొని వారి అభ్యున్నతికి పాటుపడనున్నారని అన్నారు. వ్యాప్తంగా 66,024 బంగారు కుటుంబాలను గ్రామ వార్డు, సచివాలయ సిబ్బంది ద్వారా గుర్తించామన్నారు. 2029 కల్లా పేదరికం లేని స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పని చేయాలన్నారు. సమావేశంలో జెసి కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, డిఆర్ఒ మధుసూదనరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, యూనిట్ల సిబ్బందిపాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లి


ప్రజలకు కరపత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

అభివృద్ధి, సంక్షేమం సిఎం చంద్రబాబుతోనే సాధ్యమని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాష పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం మదనపల్లి నియోజ కవర్గంలో జోరుగా కొనసాగుతోంది. నాలుగో రోజు సిటిఎం పంచాయతీలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ అబ్జర్వర్లు గురు మూర్తి, సురేష్ రాజులతో ఇంటింటా తిరుగుతూ సంక్షేమ పథకాల వివరాలను తెలియ్ఁజేసి, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసు కుంటూ వాటి పరిష్కారానికి చొరవ చూపారు. కార్యక్రమంలో పార్టీ అబ్జర్వర్లు గురుమూర్తి, సురేష్ రాజులు ముఖ్య అతి థులుగా పాల్గొన్నారు. పంచాయతీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి కార్యక్ర మంలో పాల్గొన్న వారు ప్రతి ఇంటిని సందర్శించి చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తు న్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లడం, వారి సమస్యలు తెలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. సిఎంచంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకొని సూపర్ సిక్స్ పథకాల ద్వారా సంక్షేమాన్ని అందిస్తు న్నారు. పోలవరం, అమరావతి నిర్మాణాలను వేగవంతం చేస్తూ భవిష్యత్తు తరాలకు ఆదర్శనీయమైన రాజధాని అందించేందుకు ఎంతగానో కషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ నాయకులు రామ్మూర్తి, జిలానీఖాన్, చలపతి, చల్లా నరసింహులు, రెడ్డిస్వామి, సిమెంట్ నారాయణ, ముగాడి రామ్మూర్తి, వెంకటరమణారెడ్డి, నాదెండ్ల శివప్రసాద్, నవీన్ చౌదరి, బెల్లి రెడ్డి ప్రసాద్, పోతబోలు సుధాకర్, కప్పల శ్రీరాములు, టైగర్ సురేందర్ రెడ్డి, ఎంపిడిఒ తాజ్ మస్రూర్, ఆర్ఐ బాలసుబ్రమణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు

జాతీయ లోక్ అదాలత్‌లో 71 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-పీలేరు

జాతీయ లోక్ అదాలత్లో 71 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. శనివారం పీలేరు కోర్టు ఆవరణలో స్థానిక ఇంచార్జ్ 11వ అదనపు జిల్లా జడ్జి పివీఎస్ సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు బెంచుల్లోనూ 71 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. మొదటి బెంచ్ లో చిత్తూరు ఫోక్సో కోర్టు జడ్జి ఎం. శంకర్రావు మోటర్ వాహన కేసులు, సివిల్ కేసులు, బ్యాంకు, బిఎస్ఎన్ఎల్ కేసులను, రెండవ బెంచ్ లో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శ్రీనివాసు సివిల్, క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదాల కేసులను రాజీ మార్గంలో పరిష్కరించారు. పరిష్కారమైన 71 కేసుల్లో 1 కోటి 42 లక్షల 950 రూపాయలు రాబడి వచ్చిందని తెలిపారు. కార్యక్రమాల్లో సభ్యులు, సిఐలు, బార్ ప్రెసిడెంట్, న్యాయవాదులు, ఎపిపి శారద, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విట్నెస్ అధికారి నియామక ఉత్తర్వులు రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-పీలేరు : మెగా పిటిఎంలో విట్నెస్ అధికారి నియామక ఉత్తర్వులను రద్దు చేయాలని యుటిఎఫ్ పీలేరు డివిజన్ శాఖ శనివారం డిమాండ్ చేసింది. ఈనెల 10న ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించనున్న మెగా పేరెంట్, టీచర్స్ సమావేశంలో విట్నెస్ అధికారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులే నియమించుకుని, వారిచేత వీడియోలు తీయించి అప్‌లోడ్ చేయాలని, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను తక్షణం రద్దు చేయాలని యుటియఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. సదాశివ రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు జి. శివారెడ్డి, కార్యదర్శులు అక్రం బాష, మహేంద్ర, విశ్వనాథ రెడ్డి అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి విద్యార్థుల విద్యాభివృద్ధి మీద, పాఠశాలల్లో ఉన్న మౌళిక వసతుల మీద మాట్లాడుకోవడానికి 17 రకాల కమిటీలు, ఫోటోల అప్లోడ్లు, విట్నస్ అధికారులు ఇంత తతంగం అవసరమా? అని వారు ప్రశ్నించారు. పిటిఎం కార్యక్రమాన్ని డాక్యుమెంట్ కార్యక్రమంగా మార్చడం సరికాదని, విద్యార్థుల విద్యాభివృద్ధి గురించి చర్చించే కార్యక్రమంగా దీనిని మార్చాలని యుటియఫ్ కోరుతున్నట్లు వారు పేర్కొన్నారు. బోధనకు మాత్రమే ఉపాధ్యాయులను పరిమితం చేస్తామని చెప్పిన పాఠశాల విద్యాశాఖ దానికి భిన్నంగా బోధనేతర కార్యక్రమాలకు ఉపాధ్యాయులను వినియోగిస్తోందని వారు విమర్శించారు. పాఠశాల ప్రారంభమైన నెల రోజులలోపే యోగా పేరుతో వారం రోజులు, పిటిఎం పేరుతో మరోవారం రోజులు బోధన సమయాన్ని హరిస్తున్నారని వారు విమర్శించారు. ఒక ప్రక్క విద్యార్థుల ఔట్పుట్ కోసం పర్యవేక్షణ అధికారులు పాఠశాలలకు వస్తారని చెబుతూ మరోప్రక్క బోధనేతర కార్యక్రమాల చుట్టూ ఉపాధ్యాయులని తిప్పుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరమితం చేయకుండా, బోధనేతర కార్యక్రమాల పేరుతో ఒత్తిడికి గురి చేసే విధానాన్ని ఉపసంహరించు కోవాలని వారు యుటియఫ్ తరపున డిమాండ్ చేస్తున్నారు. ఇప్పట ికైనా విద్యాశాఖ అధికారులు పాఠశాల సమయంలో బోధనకు మాత్రమే ఉపాధ్యా యులను వినియోగించు కునేటట్లు చూడాలని, మెగా పిటిఎంలో విట్నస్ అధికారి నియామకాన్ని తక్షణం రద్దు చేయాలని కోరారు. ఇదే వైఖరితో ప్రభుత్వం ముందుకు వెళితే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించక తప్పదని వారు హెచ్చరించారు.

వైద్య విద్యార్థుల జీవితాలతో చెలగాటం

ప్రజాశక్తి-మదనపల్లి


మాట్లాడుతున్న హేమంత్‌కుమార్

రాష్ట్రంలో పేద వైద్య విద్య విద్యార్థులకు పిపిపి విధానం శాపంగా మారుతు న్నాదని వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రట రీ హేమంత్ కుమార్ పేర్కొ న్నారు. శనివారం వైసిపి కార్యాల యంలో విలేక రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో వైద్య కళాశాల నిర్మాణాలను చేపట్టి పేద వైద్య విద్య విద్యార్థులు సౌకర్యార్థం కళాశాలను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేసిందన్నారు. కానీ ప్రస్తుత కూట మి ప్రభుత్వం అందుకు భిన్నంగా పిపిపి విధానాన్ని అమలు చేయడానికి చర్యలు చేపడు తోందన్నారు. విలువైన ప్రజాధనం, ప్రభుత్వ ఆస్తులను నిలువు దోపిడి చేయడం కోసమే కూటమి ప్రభుత్వం పిపిపి స్కీమ్ పేరిట భారీ స్కామ్‌కు శ్రీకారం చుట్టిందన్నారు. పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేసే ఈ కుట్రలు కుతంత్రాలకు తక్షణమే స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. విద్యార్థులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం మనుగడ సాగించిన దాఖ లాలు చరిత్రలో లేవన్న వాస్తవాన్ని గుర్తించికార్పొరేట్ శక్తుల కొమ్ముకాయడం మాను కోవాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్' అద్భుత అవకాశం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ విద్యార్థులకు ఓ అద్భుత అవకాశమని బిటి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీదేవి అన్నారు. మదనపల్లె బిటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ (వైఎస్ఎఫ్ఐ) పైన శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ యువత కోసం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన కార్యక్రమంలోవిద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అధ్యాపకుడు డాక్టర్ డి.శ్రీనివాసులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ వైఎస్ఎఫ్ఐలో రిజిస్ట్రేషన్ చేసుకుని, ఆరు మాడ్యూల్స్‌ను పూర్తి చేయాలన్నారు. తద్వారా తమలోని సృజనాత్మక శక్తితో వినూ త్నమైన ప్రాజెక్టులను తయారుచేసి, ప్రభుత్వానికి పంపి, ఆర్థిక సహాయం పొంది, స్టార్టప్‌లను ప్రారంభించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తయారు కావాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపక సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్‌రాఘవరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ శైలజ, సిఎస్.డాక్టర్ జి.చిన్నారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

పండ్ల తోటల పెంపకం లక్ష్యాలను పూర్తి చేయాలి : పీడీ

ప్రజాశక్తి-రామాపురం

మండలంలో పండ్ల తోటల పెంపకం లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. మండలంలోని బండపల్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులలో ఫీడల్ చానల్ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా శనివారం రెండువేల మంది కూలీలు ఉపాధి పనులకు హాజర య్యారని తెలిపారు. మండలంలో పండ్ల తోటల పెంపకానికి 200 ఎకరాలలో 80 మంది రైతులు ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్నట్లు పేర్కొన్నారు. మండల్ టార్గెట్ సకాలంలో పూర్తి చేయాలని ఉపా ధి హామీ సిబ్బందికి సూచించారు. పీడీ వెంట ఎపిఒ పెంచలయ్య, టిఎఫ్ఎ కూలీలు పాల్గొన్నారు

ఆలయ ధర్మకర్తల దరఖాస్తులు పరిశీలన

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో ఆలయాల ధర్మకర్తల నియామకం కోసం వచ్చిన అభ్యర్థులు, వారి దరఖాస్తులను పరిశీలించినట్లు జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ్ తెలిపారు. శనివారం పీలేరు శ్రీరౌద్రాల అంకాళమ్మ ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక శ్రీరౌద్రాల అంకాళమ్మ, దొడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానాలకు ధర్మకర్తల పదవి కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలనతో పాటు వారితో ఆలయాల అభివృద్ధికి వారు చేయాలనుకుంటున్న కృషి గురించి అడిగి తెలుసుకోవడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల పదవుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు, జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథ్‌తో పాటు కార్యనిర్వాహణాధికారి రవీందర్‌రాజు, చశికుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను తగ్గించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను తగ్గించి, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. రాష్టసమితి పిలుపుమేరకు ఎపిఎస్‌పిడిసిఎల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15.485కోట్లు ప్రజలపై భారం మోపిందని, కూటమి ప్రభుత్వం గృహాలకు స్మార్ట్ మీటర్లను బిగించే ప్రయత్నాన్ని ముమ్మరం చేస్తోందన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రజలు అడ్డుకోవాలని, అవసరమైతే పగలగొట్టాలని పిలుపునివ్వడం అదానీతో జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వం ఆదానీతో చేసుకున్న ఒప్పందాల వల్ల రానున్న 25 ఏళ్లపాటు దాదాపు ఒక లక్షా పదివేల కోట్ల రూపాయల భారం ప్రజలపై పడుతుందన్నారు. ఈ ఒప్పందాలపై కూటమి ప్రభుత్వం కనీసం సమీక్ష కూడా చేయకుండా, కేంద్రం ముందు కనీసం నోరు కూడా మెదపడం లేదన్నారు. అదానీతో జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి కె.మురళి, తిరుమలప్ప పాల్గొన్నారు.

బుడగజంగాలను ప్రభుత్వ రికార్డుల్లో చేర్చాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బుడగజంగ కులాన్ని ప్రభుత్వ రికార్డులలో తొలగించినందుకు నిరసనగా బుడగజంగ సంక్షేమ సంఘం బి.కొత్తకోట ఏరియా కమిటీ, సిపిఐ బసి కాలనీ శాఖల ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సిపిఐ తంబళ్లపల్లె నియోజకవర్గపు కార్యదర్శి ఎస్.మనోహర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్.బషీర్ ఖాన్, నాయకులు ధర్నాలో పాల్గొని సంపూర్ణ మద్దతును తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని బుడగజంగ కులాన్ని ఎస్‌సి జాబితాలో చేర్చాలని సుదీర్ఘకాలంపాటు రాష్ట్రవ్యాప్తంగా అనేకసార్లు ఆందోళనలు చేసి పాలకులకు విన్నవించారని అన్నారు. 2018 సంవత్సరంలో విజయవాడలో జరిగిన బుడగజంగ కులస్తుల రాష్ట్ర మహాసభకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై మహాసభలోనే వారికి ఎస్‌సి జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చారన్నారు. అప్పటి ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న వై.ఎస్.జగన్ పాదయాత్ర సందర్భంగా మాట ఇచ్చారని, వైసిపి అధికారంలోకి వచ్చాక ఆయన కూడా మరిచారని అన్నారు. అనంతరం తహశీల్దార్ బాబాజాన్‌కు వినతిపత్రం సమర్పించారు.

క్రైం కార్నర్

కురబలకోట టోల్‌ప్లాజా వద్ద రోడ్డు ప్రమాదం

ఆరుగురికి తీవ్ర గాయాలు - ముగ్గురి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

కురబలకోట మండలం టోల్ ప్లాజా వద్ద గొర్రెల లారీ బైక్‌ను ఢీనడంతో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం జరిగిన ఘటనపై పోలీసుల కథనం మేరకు.. పెద్దమండ్యం మండలం, ముసలికుంట గ్రామం, దట్టే నాయక్ తండాకు చెందిన కృష్ణనాయక్, ఆయన కుమారుడు బాలాజీ నాయాక్, ముసలికుంట బండ్రేవుకు చెందిన లక్ష్మయ్య, ముసలికుంటకు చెందిన మల్ రెడ్డి, రామాంజనేయ రెడ్డి తమ గొర్రెలను అంగళ్లు గొర్రెల సంతకు బోలేరోలో తీసుకెళ్లారు. వాటిని అమ్ముకుని తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా ముదివేడు టోల్ ప్లాజా వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను వీరు వెళుతున్న బొలేరో ఢీకొంది. ఈ ప్రమాదంలో గాలివీడు బలిసిపల్లికి చెందిన ద్విచక్రవాహన దారుడు మహేష్ తీవ్రంగా గాయపడ్డాడు. బొలేరో బోల్తా పడడంతో అందులో ఉన్న ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన బాధితులను టోల్ ప్లాజా సిబ్బంది కురబలకోట 108 వాహనం లో మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం బాలాజీ నాయక్, కృష్ణ నాయక్, మహేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి చేస్తున్నారు.

ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

ఘర్షణపడి నలుగురిని గాయపరిచిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ హరిబాబు తెలిపారు. మండలంలోని దేవులపల్లి పంచాయతీ బొజ్జగుంటపల్లి, వడ్డేపల్లికి చెందిన డేరంగుల శ్రీనివాసులు తన గ్రామంలోని గుడి వద్ద కూర్చుని సెల్ ఫోను చూసుకుంటూ కూర్చొని ఉన్నాడని తెలిపారు. రాజంపేటకు చెందిన కొందరు ఈ గ్రామానికి వచ్చినట్లు తెలిపారు. గామంలోనే నివాసముండే రెడ్డి ప్రసాద్ భార్య సౌజన్య, చెల్లెలు సురేఖ, రాజంపేట నుంచి వచ్చిన కొంతమంది బంధువులు కలిసి గుడి వద్ద సెల్ ఫోను చూస్తూ ఉండిన శ్రీనివాసులపై దాడి చేసినట్లు తెలిపారు. శ్రీనివాసులు గుడి వద్ద కూర్చుని వారి బంధువులను ఫోటోలు తీస్తున్నారని ఘర్షణపడి డేరంగుల శ్రీనివాసులు కొట్టి గాయపరిచారని అన్నారు. గమనించిన శ్రీనివాసులు భార్య రమణమ్మ, అన్న కొడుకు శేఖర, కోడలు శోభారాణిలు వచ్చి అడ్డుపడగా వారిపై కూడా దాడి చేశారని తెలిపారు. గాయపడిన వారిని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. వైద్యశాల నుండి వచ్చిన రిపోర్ట్ ప్రకారం, శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురి వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.